క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముద్రం సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి శనివారం తెలిపారు. వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

నేడు వైద్య శిబిరం

మర్రిపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉడుముల హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచితవైద్య శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు లేదా తెల్లకార్డు కలిగిన వారికి, ఈహెచ్‌ఎస్ ఉన్న వారికి వైద్య సేవలు అందిస్తామన్నారు.

పొగాకు సరాసరి రూ. 241



వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి రూ. 241 గా నమోదు కాగా.. ఇది రీజియన్ లోని అన్ని వేలం కేంద్రాల కన్నా అధికం కావడం గమనార్హం. వేలం కేంద్రానికి చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకి చేందిన రైతులు వేలానికి 990 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 959 కొనుగోళ్లు జరిగగా, 31 పొగాకు బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 247 కాగా, కనిష్ఠ ధర రూ. 160 పలకగా, సరాసరి రూ. 241. 25 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 29 మంది వ్యాపారులు పాల్గొన్నట్లు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పొగాకు విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరి

టంగుటూరు: రైతులు పొగాకు విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వాణిజ్య పరంగా పొగనారు కొరకు విత్తనాలు కావాల్సిన టంగుటూరు పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్ ఫీజు ఎకరానికి రూ. 200 రూపాయలు చొప్పున చెల్లించి, జూన్ 30వ తేదీ లోపల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గరిష్ఠంగా 2 హెక్టార్లకు 7 కేజీల విత్తనాలు కందుకూరు సీటీఆర్ఐలో ఇస్తారని చెప్పారు. అంతే కాకుండా ఎరువులు కావాల్సిన రైతులు బోర్డులో పేర్లు నమోదు చేసుకోవాలని.. ఇంకా పసుపు అట్టలు, టార్పాలిన్ పట్టలు, బంతి నారు, ఇతర ఉపకరణాలు కావాల్సిన వారు బోర్డులో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వ్యక్తిగత బీమా (ఇన్సూరెన్స్) కావాలన్నా, వద్దన్నా బోర్డులో అర్జీ అందించాలని చెప్పారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



డీప్ బోర్ వాటర్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: సూరా పాపిరెడ్డి నగర్‌లో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా శనివారం పట్టణంలోని 11వ వార్డు సూరా పాపిరెడ్డి నగర్‌లో చైర్మన్ గఫార్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు చైర్మన్ గఫార్‌కు ప్రధానంగా నీటి సమస్య, రోడ్లు, డ్రైనేజీ కాలువల సమస్యలను విన్నవించారు. దీంతో తక్షణ చర్యగా డీప్ బోర్‌వెల్ నుంచి ప్రతి వీధికి పైప్‌లైన్ ద్వారా నీటి కుళాయిలను ఏర్పాటు చేసి, నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానన్నారు. ఈ మేరకు మున్సిపల్, సచివాలయ ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఎమ్యునిటీ కార్యదర్శి షంషీర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీపుద్దీన్, స్థానిక నాయకులు సుబ్బారెడ్డి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ లారీ బోల్తా

కనిగిరి రూరల్: విజయవాడ నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ట్రాన్స్‌పోర్ట్ లారీ శనివారం తెల్లవారుజామున పట్టణంలోని కాశిరెడ్డి కాలనీ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. లారీలో మందులు, కొరియర్స్ తదితర సామగ్రి ఉన్నాయి. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి పమాదం జరగలేదని పోలీసులు తెలిపారు.

కౌలు కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలి

హనుమంతునిపాడు: అర్హులైన కౌలు రైతులు కౌలు కార్డులకు ఈ నెల 25 లోగా సచివాలయాల్లో దరకాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 660 మందికి కౌలు కార్డులు మంజూర్ చేశామని, పాత కౌలు కార్డులు పొందిన రైతులు 25లోపు వీర్వోలను సంప్రదించి రెన్యువల్ చేయించుకోవాలన్నారు.

రైతులకు వ్యవసాయం

- ఆర్బీకేల్లో పుష్కలంగా ఎరువులు
- రాయితీపై విత్తనాలు, ఎరువులు



సచివాలయాల్లో ఎరువులను తీసుకెళ్తున్న రైతు



సచివాలయాల్లో సిద్ధంగా ఉన్న ఎరువులు

కనిగిరి రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూన్ 1 నుంచి పంట కాలం ప్రారంభమైంది. దీంతో రైతు పక్షపాతిగా పేరుగాంచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు వ్యవసాయ సీజన్‌కు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, నీలిమందులు , ఇతర సామగ్రిని ఆయా గ్రామ సచివాయల్లోని ఆర్బీకేలో అందుబాటులో ఉంచారు. గత ప్రభుత్వాల పాలనలో రైతులు నానా అవస్థలు పడే వారు. కానీ నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగ అన్న చందంగా రైతులు అనందంగా పంటలు సాగు చేస్తున్నారు. గతేడాది రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లలో సకాలంలో వర్షాలు కురిసి, రైతుకు పంటలు బాగానే పండాయి. మంచి దిగుబడి, గిట్టుబాటు ధరలు లభించాయి. దీంతో ఈ ఏడాది కూడా రైతులు వర్షాలు కురిస్తే సాగుకు రెడీగా ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రైతు సంక్షేమమే ధ్యేయంగా అనేక కార్యక్రమాలు చేపట్టి రైతన్నకు భరోసా కల్పిస్తూ.. అండగా నిలిచారు.

అందుబాటులో ఎరువులు విత్తనాలు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 39,989 హెక్టార్లు కాగా సాగు విస్తీర్ణం 24,914 హెక్టార్లుగా ఉంది. ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లకు (2023-24)కు సంబంధించి 4,599 మెట్రిక్ టన్నులు అవసరం కానునున్నట్లు అధికారులు నివేదికలు పంపించారు. ఖరీఫ్‌కు సంబంధించి తొలి విడతగా 1,869 మెట్రిక్ టన్నులు అలాట్‌మెంట్ కాగా అందులో ప్రస్తుతం ఆర్బీకేల్లో 333.415 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. మరో 124 మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చే వారంలో దిగుబడి కానున్నాయి. డివిజన్‌లోని ఆరు మండలాల్లో ప్రసుత్తం ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సచివాలయాల్లో యూరియా 206 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 66 మెట్రిక్ టన్నులు, డీఏపీ 66 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయి. 50 శాతం సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. జనుములు 235 క్వింటాళ్లు, జీలుగలు 135 క్వింటాళ్లు, పిల్లి పెసర 113 క్వింటాళ్లు అలాట్‌మెంట్ కాగా వాటిలో 62.4 క్వింటాళ్ల విత్తనాల కోసం 92 మంది రైతులు విత్తనాలకు దరఖాస్తులు చేసుకున్నారు.

ఖరీఫ్‌లో సాగు చేసే పంటలు

కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో ఖరీఫ్‌లో ఎక్కువగా కంది సాగు చేస్తారు. అధికారుల నివేదికల ప్రకారం మొత్తం ఖరీఫ్ సాగు విస్తీర్ణం 24,914 హెక్టార్లు కాగా అందులో ఒక్క కందినే అత్యధికంగా 15,318 హెక్టార్లు, సజ్జ 2,381 హెక్టార్లు, వరి 568 హెక్టార్లు, మిరప 672 హెక్టార్లు, పత్తి 563 హెక్టార్లు, మినుము 367 హెక్టార్లు, పొద్దు తిరుగుడు 253 హెక్టార్లు, మిగతా పంటలు స్వల్పంగా సాగు చేయనున్నారు.

నియోజకవర్గంలోని ఆర్బీకేల వివరాలు :

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గల 135 పంచాయతీల్లో 96 ఆర్బీకే కేంద్రాలున్నాయి. సచివాలయాల పరిధిలో ఆర్బీకే కేంద్రాలను రైతులకు నిత్యం వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలిస్తూ పంట సాగులో రైతన్నకు వీఏఏ (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్)లు అండగా నిలుస్తున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు రాయితీపై అందచేసే విత్తనాలు, ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి. ఎరువులు సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. యాభై శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పిల్లిపెసర అందచేయనున్నాం. విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగానే ఆర్బీకేల్లో నమోదు చేసుకొవాలి. ఎప్పటికప్పుడు అందుబాటులోని ఎరువులు, విత్తనాల వివరాలను రైతులకు తెలియచేస్తున్నాం. రైతులు సద్వినియోగం చేసుకోండి.

– ఈ వెంకట రమణ (ఏడీఏ కనిగిరి)

కనులపండువగా శాంతి కల్యాణం



విశిష్ట అలంకరణలో అచ్చమాంబ మూలవిగ్రహమూర్తి



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పామూరు: మండలంలోని కమ్మవారిపాలెం, రఘునాథపురం అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల్లో 4వ రోజు శనివారం అచ్చమాంబ పేరంటాలు, వెంగమనాయుడు ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొల్లూరి రవి కిరణ్‌శర్మ అచ్చమాంబ మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం విశిష్ట పూజలు చేశారు. అనంతరం శాంతి కల్యాణం నిర్వహించి ప్రత్యేకవాహనపై మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యార్థులకు మెడల్స్ ప్రదానం



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న హెచ్‌ఎం



అద్విత్‌కు నగదు బహుమతి అందజేస్తున్న దాతలు

హనుమంతునిపాడు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, మూడు స్థానాల్లో నిలిచిన వారికి ప్రభుత్వం అందజేసిన మెడల్స్‌ను శనివారం పాఠశాల హెచ్‌ఎంలు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం జీవీ సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. భవిష్యత్‌లో మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బి.సుబ్బారావు, బ్రహ్మయ్య, నాగయ్య, రామయ్య, వెంకటయ్య, భాగ్యరేఖ, రహేనా, గౌషబాష పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థి అద్విత్‌కు నగదు బహుమతి

పొన్నలూరు: మండలంలోని ముండ్లమూరివారి పాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థి ఒంగోలు అద్విత్ పదో తరగతి ఫలితాల్లో 562 మార్కులు సాధించి మండల స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచాడు. దీంతో పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసిన బి. మాధవరావు రూ. 5000 నగదుతో పాటు ట్రావెల్ బ్యాగును, పొన్నలూరు జెడ్పీ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు టి. బాలకృష్ణ రూ, 2000 నగదు బహుమతి శనివారం అందజేశారు. చెక్కా వెంకట కేశవరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో 586 మార్కులు సాధించిన మొగళ్లూరు జిల్లా పరిషత్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు క్యాష్ అవార్డు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా శనివారం మొగళ్లూరు జడ్పీహైస్కూల్‌కి చెందిన ఎస్ హరికృష్ణ, ఏ ప్రహల్లాదరెడ్డిలకు రూ.50 వేలు క్యాష్ అవార్డు, ప్రశంసపత్రాలను అందుకున్నారు.

జవాబుదారీతనంగా పనిచేయండి



సమీక్ష నిర్వహిస్తున్న డీడీ శ్రీనివాసరావు

గుడ్లూరు: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంగా పనిచేయాలని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పోట్లూరు, చెమిడిదిపాడు గ్రామ సచివాలయాలను శనివారం ఆకస్మికంగా తనికీ చేశారు. రెండు సచివాలయాల్లో రికార్డులను, రిజిష్టర్‌లను, ఉద్యోగుల హాజరుపట్టీలను, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. అనంతరం రెండు సచివాలయాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమస్యలపై కార్యాలయాలకు వచ్చిన ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా పరిష్కరించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించినప్పుడే ప్రజల మన్ననలు పొందుతారన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ చంద్రసేన్, సర్పంచ్‌లు నూసపాటి సుబ్బరాజు, చిత్తారి హైమావతి మల్లికార్జున, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



మన్నేటికోటలో పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

ఉలవపాడు: మండల పరిధిలోని మన్నేటికోట సమీపంలో మన్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం ఎస్సై బాజిరెడ్డి పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తీసుకు వెళ్తున్నారన్న సమాచారం మేరకు మన్నేరు శివారులో వెళ్లి పరిశీలించి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెట్రోల్ పోసుకుని ప్రాణం తీసుకుంది

తిరుపతి రూరల్: ఓ యువతి పెట్రోలు పోసుకుని ఆస్పత్రిలో పోరాడుతూ ప్రాణాలు వదిలిన ఘటన శనివారం తిరుపతి రూరల్ మండలం, పాతకాల్వ సమీపంలో చోటుచేసుకుంది. టంగుటూరుకు చెందిన మణిమాల (21) తన అక్క సౌజన్యతో కలిసి తిరుపతిలోని వేశాలమ్మ గుడివీధి సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. ఉన్నత చదువులు చదివిన అక్కాచెల్లెళ్లు ప్రైవేటుగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంకా పెళ్లి కూడా కాలేదు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం విధుల నుంచి వచ్చిన మణిమాల ఏడు గంటల సమీపంలో తిరుపతి రూరల్ మండలం, పాతకాల్వలోని వకుళమాత ఆలయం వద్దకు వచ్చింది. అనంతరం ఆలయ సమీపంలో వెంట తెచ్చుకున్న పెట్రోల్ తీసుకుని ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. వకుళమాత ఆలయ విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకునే సరికి అప్పటికే 90 శాతం కాలిపోవడంతో 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. తిరుపతి రూరల్ ఎస్ఐ ఎస్ఐ మూర్తి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వైభవంగా బుద్ధుని విగ్రహ ప్రతిష్ట



రహదారి పక్కన ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహం

ఉలవపాడు: మండల పరిధిలో మన్నేటికోట రోడ్డు సమీపంలో జాతీయరహదారి పక్కన గౌతమ బుద్ధుని విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. ఎస్‌ఆర్‌ఐ బోగినేని చెంచురామానాయుడు తన సొంత నిధులతో జాతీయరహదారి వెంబడి తన పొలంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా యాగం నిర్వహించారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. బీజేపీ రాష్ట్ర నాయకులు పీవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నిశాంత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గన్నారు.

మాలకొండ ఆదాయం రూ.9,13,925

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.9,13,925 వచ్చిన్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.25,040, తలనీలాలు రూ.57,800, ప్రత్యేక దర్శనం రూ.2,80,700, లడ్డుప్రసాదాలు రూ.2,17,905, అన్నదానం రూ.2,85,280, రూమ్‌అద్దెలు రూ.28,460 వచ్చినట్లు పేర్కొన్నారు.

పారదర్శకంగా ఆడిట్ నిర్వహించాలి

గుడ్లూరు: ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందాలు నిర్వహిస్తున్న ఆడిట్‌ను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీపీ పులి రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో శనివారం సామాజిక తనిఖీ బృందాలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏపీడీ సంజీరావు మాట్లాడుతూ ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలకు టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. తనిఖీల సమయంలో ఉపాధిహామీ పనులను నిలిపివేయకుండా కొనసాగించాలన్నారు. ఎంపీడీఓ చంద్రసేన్, ఏపీఓ వినయ్, పీఆర్‌జేఈ ఇమ్మానియేల్, ఎస్‌ఆర్పీ మురాద్, డీఆర్పీలు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ఉలవపాడు: మండల పరిధిలోని చాకిచర్ల పంచాయతీ అంకమ్మపాలెంలో శనివారం రాత్రి పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.81,500, ఒక కారు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బాజిరెడ్డి తెలిపారు.

విద్యార్థినికి అభినందనలు



నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, మెమొంటో అందుకుంటున్న స్పందన



కలెక్టర్ చేతుల మీదుగా మెడల్ అందుకున్న విద్యార్థిని ప్రవల్లిక

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ చదివిన సంద్రపాటి స్పందన 972/1000 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. శనివారం ఒంగోలు లోని పీవిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో కలెక్టర్ దినేష్ కుమార్, ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాతల చేతుల మీదగా స్పందన రూ. 50 వేలు నగదు, మెరిట్ సర్టిఫికెట్, మొమెంటో అందుకుంది. జిల్లా రియో సైమన్ విక్టర్, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు స్పందనకు అభినందనలు తెలిపారు.

హనుమంతునిపాడు: జిల్లాలోని కేజీబీవీ పాఠశాలలో ప్రథమస్థానం సాధించిన హెచ్‌ఎంపాడు విద్యార్థిని వి. ప్రవల్లికు జిల్లా స్థాయి అవార్డును మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ చేతుల మీదుగా అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఓ ఇందిరా సుహాసిని విద్యార్థిని అభినందించారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లికార్జునరావు

కనిగిరి రూరల్: యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జున రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్‌ఎల్ టెక్ బీ కేరీర్ ప్రోగ్రాంను శనివారం నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్ లోకనాథం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు అర్హత ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పనకు హెచ్‌సీఎల్, ఎంఎన్‌సీ లాంటి కంపెనీల్లో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారికి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి మాట్లాడుతూ మారుమూల కనిగిరి ప్రాంతంలోని విద్యార్థులకు, యువతకు జిల్లానైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంచి అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. కష్టపడి కంపెనీల్లో ఆత్మ విశ్వాసంతో పనిచేసి, నైపుణ్యతను చాటి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆర్ లోకనాథం మాట్లాడుతూ కనిగిరి డివిజన్‌లోని హెచ్‌ఎల్ టెక్ బీ ప్రోగ్రాంకు 80 విద్యార్థులు హాజరు కాగా వారిలో 40 మంది అర్హత సాధించి ఆన్‌లైన్ పరీక్ష రాసి ఇంటర్వ్యూలకు హాజరు కాగా 13 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 18న ఆదివారం ఒంగోలు హర్షిణి డిగ్రీ కళాశాలలో, 19న సోమవారం మార్కాపురం డివిజన్‌లో డాక్టర్ శ్యామ్యూల్ జార్జ్ ఇంజినీరింగ్ కళాశాలలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. హెచ్‌సీఎల్ హెచ్ ఆర్ ప్రతినిధులు బీగాల శ్రీనివాసరావు, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ బెనర్జీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కోసం ‘జగనన్న ఆణిముత్యాలు’



వెంకట సుజాతను సన్మానించి బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు పేరుతో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేశామని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో మాట్లాడారు. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యుత్తమైన ప్రతిభ కనబరిచి, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తించి, వారిని ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు పేరుతో నగదు బహూకరించి, మెడల్, ప్రసంస పత్రాలను అందించడం గొప్ప విషయమన్నారు. గత ఏడాది అత్యధిక మార్కులు సాధించిన అలికేపల్లి వెంకటసుజాత, ద్వితీయ మార్కులు సాధించిన భూనా శ్రవంతి, తృతీయ మార్కులు సాధించిన ఆర్. బ్రహ్మారెడ్డిలకు ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మెడల్, ప్రసంసపత్రాలు, నగదును అందజేసి శాలువాలతో సన్మానించి అభినందించారు. సర్పంచ్ కె. భాస్కర్, విద్యాకమిటీ చైర్మన్ డి. శివరామయ్య, హెచ్‌ఎం ఆర్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న వైద్యులు బాబురావు

హనుమంతునిపాడు: క్షయ వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డాక్టర్ మూరక ప్రతాపరెడ్డి, కనిగిరి టీబీ శాఖ సూపర్‌వైజర్ వై బాబురావు అన్నారు. టీబీపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంఎల్‌హెచ్‌పీలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికల్ అధికారి మురక ప్రతాపరెడ్డి, కనిగిరి టీబీ వైద్య శాఖ సూపర్‌వైజర్ వై బాబురావు మాట్లాడుతూ ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకే అంటు వ్యాధన్నారు. గ్రామాల్లో దగ్గు, జ్వరం రెండు వారాల నుంచి తగ్గకుండా వస్తున్నా, క్రమంగా బరువు తగ్గడం, కళ్లెలో రక్తం బడుతున్నా లక్షణాలున్న వారు వెంటనే కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలన్నారు. పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు మందులు వాడాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకునేందుకు నగదు బ్యాంకుల్లో జమ చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీలను టీబీ విముక్తి పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలన్నారు. సీహెచ్ఓ కేవీ చెన్నయ్య, వీఓఆర్టీ షేక్ షరీఫ్, సిబ్బంది రఘురాము తదితులున్నారు.

పాకల బీచ్‌లో మెరైన్ అవుట్ పోస్ట్ ఏర్పాటు



మెరైన్ అవుట్ పోస్టు ప్రారంభిస్తున్న కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ డీఎస్పీ శ్రీనివాసరావు

సింగరాయకొండ: పాకల బీచ్‌లో శనివారం రామాయపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసిన మెరైన్ అవుట్ పోస్టు కార్యాలయాన్ని కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ డీఎస్పీ ఎం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ అవుట్ పోస్టు ద్వారా బీచ్‌కు వచ్చే పర్యాటకులకు సత్వరమే సహాయ సహకారాలు అందించటానికి అవకాశం ఏర్పడిందన్నారు. మెరైన్ సీఐ ఆర్‌ఎస్ కిషోర్‌కుమార్, కొత్తపట్నం మెరైన్ సీఐ కె. శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ ఫాతిమ, మెరైన్ ఎస్సై పి. ఈశ్వరయ్య, కొక్కిలిగడ్డ వెంకటేశ్వర్లు, గ్రామ కాపు గొల్లపోతు సురేష్, గొల్లపోతు గోవర్ధన్ పాల్గొన్నారు.